విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

ఇష్టంగా చదివి విద్యావంతులు కావాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: విద్యార్థులు ఇష్టంగా చదివి విద్యావంతులు కావాలని జడ్పీటీసీ దాసరి కత్రేణమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని నుదురుపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం విద్యాజ్యోతి పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. అదేవిధంగా ఫిరంగిపురంలో అల్లంవారిపాలెంలో జడ్పీ హైస్కూల్‌ను మధ్యాహ్నం సందర్శించి భోజన పథకాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి జగనన్న కల్పించిన అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి సదుపాయాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. పదోతరగతిలో మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కె.చిన్నప్పరెడ్డి, కె.అప్పిరెడ్డి, రంజన్‌బాబు, సర్పంచ్ శివనాగమల్లేశ్వరి చౌదయ్య, ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేలు, డానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాషను భ్రష్టు పట్టిస్తున్న నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాజకీయ భాషను భ్రష్టు పట్టిస్తున్న నాయకుల తీరు అసహ్యకరంగా ఉందని, వారిని ఎన్నుకున్న ప్రజలు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి నేడు నెలకొని ఉండటం హేయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఎంత దిగజారిపోయాయంటే తిట్టడం కోసం ప్రత్యేకంగా కొందరిని పోషిస్తోందని, నోరు తెరిస్తే చాలు బూతులు, అమర్యాదకర సంబోధనలతో తమ వర్గీయులను రంజింప చేయడం ఇప్పటి రాజకీయాలలో పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. దురుసుగా, మొరటుగా మాట్లాడటం ఒక విధానంగా అభివృద్ధి కావడం విచారకరమైన విషయమని, దృశ్య మాధ్యమాల వ్యాప్తి తరువాత తిట్ల దండకంతో జనాన్ని ఆకట్టుకోవచ్చన్న భ్రమ రెండు తెలుగు రాష్ట్రాల నాయకుల్లో ఉందని విమర్శించారు. వ్యక్తిగత విషయాలను, రూపురేఖలను, స్వభావ విషయాలను కించపరిచేలా, అక్షరాలు తలదించుకునేలా మాట్లాడటం ఏమి సంస్కారమో అర్థం కాని విషయమని తెలిపారు. రాజకీయ సంస్కృతికి ఒకసారి మకిలీ పట్టిందంటే దాన్ని మళ్లీ సభ్యత మార్గానికి మళ్లించడం కష్టమని, మేధావులు, విద్యావంతులు ఈ తిట్ల సంస్కృతిని వ్యతిరేకిస్తూ, హెచ్చరిస్తూ ముందుకు రావాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.

ఎంఈఓ సహకారం అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు : ఉర్దూ పాఠశాలల అభివృద్ధిలో మండల విద్యాశాఖాధికారి సహకారం అభినందనీయమని ఉర్దూ డీఐ ఎండీ ఖాసీం అన్నారు. కాకుమాను మండలంలోని లింగంగుంట పాలెం, కొమ్మూరు, కాకుమాను, రేటూరు గ్రామాలలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో కేఎఫ్ కెనడీతో కలిసి మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్తు ఉందని, తల్లిదండ్రులను, విద్యార్థులను ప్రోత్సహించి ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల కాస్ట్-నో కాస్ట్ నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. కొమ్మూరు కాకుమాను, రేటూరు, లింగంగుంట్ల పాలెం ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో మారుతి ఫౌండేషన్ భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర-తాడేపల్లి : నులకపేట వద్ద టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లో మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు భోజనం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు హాజరై భోజనం పంపిణీ చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా నెలలో ఐదు రోజులు అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం పంపిణీ చేస్తున్నామన్నారు. టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు చల్లా శ్రీను, నాయకులు కొర్రపాటి విజయ్, నాగుల్ మీరా, చాంద్ బాషా, రిక్షా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యర్రగోపు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గుంటూరు జిల్లా కార్యదర్శి యర్రగోపు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు గుంటూరు అర్బన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్బన్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ కేక్ కట్ చేసి నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. రానున్న కాలంలో ఆయన మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చౌదరి శ్రీను, మీరావలి, సిరాజ్, కొండెపు శేఖర్, ఎద్దల రమేష్, గొడుగు శంకర్, సుబ్బారెడ్డి, బాబు, రాంబాబు, బండ్లమూడి మధు, సీఫ్, పి.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు దండమూడి మనోజ్ మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ సీనియర్ నాయకులు, చిర్రావూరు మాజీ సర్పంచ్, తాడేపల్లి బాలాజీ గ్యాస్ కంపెనీ యజమాని దండమూడి మనోజ్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పలువురు రాజకీయ పార్టీ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



విశాలాంధ్ర-దుగ్గిరాల : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతుల పక్షపాతి అనిపించుకున్నారని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అన్నారు. మండల పరిధిలోని ఈమనిలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన సౌకర్యాలను రైతు భరోసా కేంద్రాల్లో అమర్చి వ్యవసాయం పండుగలా మార్చారన్నారు. రైతులు పండించిన పంటను సరైన ధరకే గిట్టుబాటు లభించేలా అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి.శిరీష, వైసీపీ నాయకులు దాసరి వీరయ్య, తానుబోయిన వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కంచర్ల దావీదు పాల్గొన్నారు.

రేపు జీవీ కృష్ణారావు వర్ధంతి సభ

విశాలాంధ్ర-గుంటూరు : అమరజీవి కామ్రేడ్ జీవీ కృష్ణారావు 6వ వర్ధంతి సభ డిసెంబర్ 1న సంగడిగుంట ఏటుకూరు రోడ్డులోని రేగుల రాఘవయ్య భవన్ వద్ద నిర్వహించనున్నట్లు హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, జీవీకే మెమోరియల్ ట్రస్ట్ కన్వీనర్ అమ్మిశెట్టి శివ తెలిపారు. స్థానిక రేగుల రాఘవయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ, ఏఐటీయూసీ నగర సమితులు, జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే సభకు ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం వివిధ రంగాలలో సేవలందించిన ఒకరికి జీవీకే మెమోరియల్ అవార్డును అందజేస్తారని, ఈ సంవత్సరం సీపీఐ గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి, నరసరావుపేట పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ వై.చెంచయ్యకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వివరించారు. జీవీ కృష్ణారావు రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ(ముఠా) ఫెడరేషన్, భవన నిర్మాణం, సివిల్ సప్లయిస్, అసంఘటిత రంగ కార్మికులకు సంఘాలను నిర్మించి, కార్మికుల సంక్షేమానికి గర్వించదగిన పాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. గుంటూరు నగరంలో భూపోరాటాలు నిర్వహించి వేలాది మందికి గూడు కల్పించడంతో పాటు అనేక కాలనీల నిర్మాణానికి ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. పార్టీ, ఏఐటీయూసీలో అనేక హోదాలలో పనిచేసిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తి కోసం నిరంతరం శ్రమించారని అన్నారు. వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్‌బాబు, అధ్యక్షులు రావుల అంజిబాబు, జీవీకే మెమోరియల్ ట్రస్ట్ మెంబర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, కృష్ణ జిల్లాల ప్రజలు చేనేత వస్త్ర ప్రదర్శనను సందర్శించి, వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమ ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత తెలిపారు. మంగళవారం స్థానిక రాజాగారితోటలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన 2022ను కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా, శాసన మండలి ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్, శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, సంయుక్త కలెక్టర్ రాజ కుమారితో కలిసి ప్రారంభించారు. పదర్శన స్టాల్స్‌లో చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.సునీత మాట్లాడుతూ కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేనేత వస్త్ర ప్రదర్శనలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని చేనేత వస్త్ర ఉత్పత్తులతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధ చేనేత వస్త్రాలతో 61 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. ధర్మవరం, వెంకటగిరి, ఫణిదం, పుత్తూరు, చీరాల, ఉప్పాడ, బొబ్బిలి కాటన్, సిల్క్ సాదా జరీ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, కార్పెట్లు, లుంగీలు, పొందూరు షర్ట్స్, తెలంగాణ మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి వివిధ రకాలైన చేనేత వస్త్రాలను తక్కువ ధరకే అందు బాటులో ఉంచారని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కృష్ణ, బలిజ, పూసల కార్పోరేషన్ చైర్ పర్సన్ భవానీ, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ చైర్ పర్సన్ దేవళ్ళ రేవతి, చేనేత, జౌళి శాఖ సంయుక్త సంచాలకులు నాగేశ్వర రావు, ప్రాంతీయ సంచాలకులు నాగేశ్వరరావు, ఎన్‌హెచ్‌డీసీ రీజనల్ మేనేజర్ సకోడియా, వీవర్స్ సర్వీస్ సెంటరు ఉప సంచాలకులు టీఎస్ఎన్ రెడ్డి, టెక్స్‌టైల్స్ కమిటీ ఏడీ హరిబాబు, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ ఏడీ వనజ, ప్రతినిధులు పాల్గొన్నారు.

అలీ కుమార్తె రిసెప్షన్ వేడుకలో జగన్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ప్రభుత్వ సలహాదారు (ఎలక్ట్రానిక్ మీడియా), సినీ నటుడు డా.మహమ్మద్ అలీ కుమార్తె వలీమా రిసెప్షన్ వేడుకలో పాల్గొన్నారు. వధువు మహ్మమద్ ఫాతిమా రమేజున్, వరుడు షేక్ షహయాజ్‌లను ఆశీర్వదించారు. ముందుగా అలీ కుమార్తె వలీమా రిసెప్షన్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రికి శ్రీ కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా, శాసన మండలి ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వర ప్రసాద్, గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ్ వర్మ, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫిజ్, శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, నగరపాలక సంస్థ కమీషనర్ కీర్తి చేకూరి, శాసన సభ్యులు మేకతోటి సుచరిత, డా.ఉండవల్లి శ్రీదేవి, కిలారి వెంకట రోశయ్య, మద్దాల గిరిధర్, షేక్. మహమ్మద్ ముస్తఫా, మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణు గోపాల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రగిరి ఏసు రత్నం, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం, వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ళ రేవతి, కృష్ణబలిజ, పూసల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ భవాని మణికంఠ, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, వైసీపీ నాయకులు మర్రి రాజశేఖర్ పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

సీఎంను కలిసిన నగర మేయర్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం గుంటూరు నగరంలో జరిగిన సినీనటుడు అలీ కుమార్తె వివాహ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా హెలిప్యాడ్ దగ్గర గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి బోకే అందజేసి స్వాగతం పలికారు.

వెండింగ్ పాలసీ అమలుకు చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో వీధి వ్యాపారులను గుర్తించి, వారికి సమగ్ర విధానం అమలు చేస్తూ వెండింగ్ పాలసీ అమలుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులు, మెప్మా సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, వెండింగ్ కమిటి సభ్యులతో గుంటూరు నగర వెండింగ్ కమిటి సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఎటువంటి సమస్యలు లేకుండా సమగ్ర విధానం తీసుకురానున్నామని తెలిపారు. ఇప్పటివరకు నగరంలో సుమారు 4800 మంది వీధి వ్యాపారులను గుర్తించామని, ఇంకా ఎవరైనా ఉంటే కమిటి సభ్యులు వివరాలు అందించాలని తెలిపారు. గుర్తించిన వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డ్‌లు, వెండింగ్ సర్టిఫికేట్స్ అందించడం, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేసి, ఆయా జోన్లలో వీధి వ్యాపారులకు మార్కింగ్ ఇస్తామన్నారు. అనంతరం వెండింగ్ పాలిసిలో బైలా, గ్రీన్, రెడ్, అంబర్ వెండింగ్ జోన్ల వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటి సభ్యులకు వివరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు, అజయ్ కుమార్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

నగరపాలక సంస్థకు ఉన్న పన్ను బకాయిలను పూర్తీ స్థాయిలో చెల్లించి, నగరాభివృద్ధికి సహకరించాలి, నిర్మాణాలకు ముందే ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తేనే ఆక్యుపెన్సీ, మార్టిగేజ్ రిలీజ్ చేస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గుంటూరు నగరంలోని జిటి రోడ్‌లో నిర్మించిన జ్యోతిర్మయి ప్రాపర్టీస్ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఖాళీ స్థల పన్ను రూ.1.5 కోట్ల చెక్‌ను మంగళవారం నగర కమిషనర్‌కి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.నాగ వంశీ అందించారు.

ఆక్రమణలు తొలగించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇతరులకు ఇబ్బందులు కలిగేలా ఆక్రమణలు చేపడితే తొలగించటానికి చర్యలు తీసుకుంటామని, ముందుగా స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా తెలిపారు. మంగళవారం 4వ డివిజన్‌లో పర్యటించి బస్టాండ్ వెనుక ప్రాంతం ఇటుక బట్టీల రోడ్డులో పరిశీలించారు. హిందూ శ్మశాన వాటికకు మృతదేహాలను తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావటంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆటో మెకానిక్ షెడ్లు, ఆటో మొబైల్స్ దుకాణాలు రోడ్లపై ఉండటాన్ని గమనించి రోడ్లపై నుంచి తొలగించాలని దుకాణాదారులకు సూచించారు. సర్వే చేపట్టి మార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్మశాన వాటికరోడ్డులో ఆక్రమణలు ఉంటే త్వరలో తొలగిస్తామని, హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయటానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొహమూద్, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ తమవంతుగా కృషి చేయాలని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ విభాగాధిపతి డాక్టర్ పి.సెంథిల్ మురుగన్ పేర్కొన్నారు. మంగళవారం చిర్రావూరులో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోండి.. నివారణ ఒక్కటే మార్గం, వ్యాధి గురించి తెలుసుకోండి... రాకుండా జాగ్రత్త పడండి... ఎయిడ్స్‌ను ద్వేషించండి.. వ్యాధిగ్రస్తులను కాదు అంటూ నినాదాలు చేస్తూ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సిహెచ్ హనుమంతరావు తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ కరచాలనం, కలిసి భోజనం చేయడం వలన ఎయిడ్స్ వ్యాధి వ్యాపించదని, హెచ్ఐవీ ఉన్న రక్తం ఎక్కించుట, ఒకరికి వాడిన సూది మరొకరికి వాడుట, అసురక్షితమైన సెక్స్ తదితర కారణాల వల్ల ఎయిడ్స్ వ్యాపిస్తుందని సూచించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రుతు రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి వలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అతుల్ సింగ్, సుదీప్తి, రీతాంజలి మెహర్, మానస, పార్థ బెనర్జీ, వీజీ కృష్ణమూర్తి, పి.సురేష్, జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : చెత్త పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మెప్మా ఆర్పీలు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. తమ వార్డుల పరిధిలో 100 శాతం చెత్త పన్ను వచ్చేలా చూడాలని తెలిపారు. చెత్త పన్ను వసూళ్లలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యారమ్స్‌లో విద్యార్థినిల ఘనత

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల బాలబాలికల ప్రజా పరిషత్ హైస్కూల్లో మంగళవారం జిల్లా స్థాయిలో క్యారమ్స్ అండర్-17లో వేల్పూర్ శ్రీవిద్య మొదటి, యార్లగడ్డ స్నేహ ద్వితీయ స్థానాన్ని గెలుపొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి అన్నారు. ఇంకా అనేక మంది విద్యార్థులు ఆటల్లో పాల్గొని మంచి స్థాయిలో ముందుకు వెళ్లాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలో గల వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎంల గోడౌన్‌ను గుంటూరు డీఆర్వో కె.చంద్రశేఖరరావు మంగళవారం తనిఖీ చేశారు. గూడౌన్ చుట్టు ప్రక్కల భద్రత ఏర్పాట్లను పరిశీలించి ఎలక్ట్రికల్ విద్యుత్ సదుపాయం, రెవిన్యూ మరియు సెక్యూరిటీ ఈవీఎంలకు భద్రతకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఫిరంగిపురం తహశీల్దార్ పద్మనాభుడు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'జాతీయ ఫార్మశీ వారోత్సవాలు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఫార్మశీ నిపుణులు తాము ఎంచుకున్న రంగంలో సమాజసేవ చేసి ఫార్మశీ వృత్తికి మంచి గౌరవం పొందేవిధంగా తమ విధులను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎస్.రామమూర్తి అన్నారు. అమరావతిరోడ్డులో ఉన్న హిందూ ఫార్మశీ కళాశాలలో నవంబర్ 21వ తేదీ నుంచి జరుగుతున్న జాతీయ ఫార్మశీ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ముగింపు వారోత్సవాలకు అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు 'ఫార్మశీ ఆఫ్ ది వరల్డ్-ఇండియా'అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఫార్మశీ విద్యార్థులకు సంబంధిత సభ్యులకు ఔషధ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాల వారు నిర్వహించిన వివిధ వక్తృత్వ, ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్చియార్డ్‌లో కనుల పండువగా అయ్యప్ప పడిపూజ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సమాజ హితాన్ని కాంక్షిస్తూ అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించినట్లు ఎమ్మెల్సీ, శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆవరణలో మాలధారణ స్వాములకు సద్ది వితరణ కార్యక్రమాన్ని దేవస్థానం కమిటీ, మిర్చి ఫ్యామిలీ ఆధ్వర్యంలో వేలాదిమంది స్వాములకు ద్వితీయ పడిపూజ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా కేరళ తాంత్రిక స్వామి బాలచంద్రన్ ఆధ్వర్యంలో గణపతి హోమాలు, పంచామృత అభిషేకాలు డప్పు శీను నేతృత్వంలో అయ్యప్ప నామ సంకీర్తనలతో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణంతో శోభిల్లింది. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ కఠినమైన నియమాలతో సాగే అయ్యప్పల అకుంఠిత దీక్ష వలన సర్వత్ర ఆధ్యాత్మిక చింతన పరిడ విల్లుతుందని, మాల ధరించిన వారిలో సాత్విక భావనలతో పాటు ఆత్మ పరిశీలన శక్తి పెంపొందుతుందన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ మణికంఠుడికి నిష్టగా పూజ చేయడంతో పాటు శక్తిరూపుడు.. జ్యోతి స్వరూపుడైన అయ్యప్పను కఠోర నియమాలు ఆచరిస్తూ ఆరాధించడం వలన జన్మ జన్మలకు పుణ్యఫలం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అయ్యప్పస్వామిని అత్యంత భక్తి శ్రద్ధలతో సేవించిన ఫలితంగా యావత్ సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని అన్నారు. మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అయ్యప్ప మాల ధారణ స్వాముల పూజలతో యార్డులో సర్వత్ర ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యార్డ్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, మిర్చి ఫ్యామిలీ మెంబర్స్ కోటా సాంబశివరావు, కుర్రి సాంబిరెడ్డి, పొత్తూరి సుధాకర్, లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, యలమంచిలి పుల్లారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రైతులు ప్రకృతి వ్యవసాయ పంటలపై దృష్టి సారించాలని గుంటూరు జిల్లా ఉద్యానశాఖ అధికారులు సుజాత, అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని 113తాళ్ళూరు గ్రామంలో జరిగిన పొలంబడి కార్యక్రమానికి విచ్చేసిన ఉద్యానశాఖ అధికారులు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి ఆర్‌బీకే ద్వారా రైతులకు అందుతున్న సేవా కార్యక్రమాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొలాలను పరిశీలించి రసాయన వ్యవసాయంతో వచ్చే నష్టాల గురించి వివరించారు. రసాయనాలు తక్కువ మోతాదులో వాడుకోవాలని రైతులకు సూచించారు. మిరప పంటలో పాటించాల్సిన సస్య రక్షణ చర్యలు గురించి వివరించి పంట పొలంలో లింగాకర్షణ బుట్టల ఉపయోగాలపై అవగాహన కల్పించి అంతర్ పంటల ప్రాధాన్యతను వివరించారు. ప్రకృతి వ్యవసాయ డివిజన్ సిబ్బంది ఎస్‌డిఎ అన్నామణి, ఎం.టి వీరలక్ష్మి రైతుల పంటల్లో వచ్చు తెగుళ్ల నివారణకు ఉపయోగించే కషాయాల గురించి ఆర్‌బీకే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందే ప్రకృతి వ్యవసాయ పంటలు రైతులు పండించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బికె విహెచ్ఎ జానీ భాష, యూనిట్ ప్రకృతి వ్యవసాయ సీనియర్ ఐ.సి.ఆర్.పి ఇర్ల వెంకటేశ్వర్లు, తన డివిజన్‌లో నూతనంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తోటి ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై అవగాహన అవసరం...

విశాలాంధ్ర-గుంటూరు : అమరావతి రాజధాని ప్రాంత సమస్యలపై సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుపై ప్రజలు సరైన అవగాహన కలిగి ఉండాలని, లేకపోతే వైసీపీ నాయకులు మోసానికి గురిచేస్తూనే ఉంటారని టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తరువాత కూడా సజ్జల బృందం రాజధాని విషయంలో ఇంకా అసత్య ప్రచారాలు కొనసాగిస్తున్నారంటే న్యాయవ్యవస్థ పట్ల కానీ, ప్రజాస్వామ్యం పట్ల కానీ ఏమాత్రం గౌరవం ఉందో అర్థం అవుతుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కదారి పట్టిస్తూ... మూడు రాజధానులకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ ప్రచారం చేయడం వైసీపీ ప్రభుత్వ పిచ్చితనానికి నిదర్శనమని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయవాదులతో అసత్యాలు చెప్పించి వైసీపీ నాయకులు, సజ్జల బృందం... గ్లోబెల్స్‌కు నిజమైన వారసులని అన్నారు. న్యాయ వ్యవస్థ మీద, ప్రజాస్వామ్య వ్యవస్థ మీద జగన్ రెడ్డికి నమ్మకం ఉంటే వెంటనే రాజకీయాల నుంచి తప్పుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, రావిపాటి సాయికృష్ణ, నాయుడు ఓంకార్, తలతోటి సురేంద్ర, నార్నె శ్రీనివాస్, తలశిల ప్రసన్న కుమార్, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఎంతో కీలకమని, 18 ఏళ్లు నిండిన యువతి యువకులు అందరూ విధిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ జీవీ రాంప్రసాద్ సూచించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు గణపతి నగర్ వీజే డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటు హక్కు నమోదుపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీజే కళాశాల కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు ఎంతో విలువైందన్నారు. గుర్తుచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ కార్డులో తప్పులు ఉంటే సవరణ చేయించుకోవాలని ఓటు కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని ఆయన తెలిపారు. 200 మంది విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమం వీజే కళాశాలలో ఈ నెల 30న జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. ఆత్మకూరు పంచాయతీ సెక్రెటరీ సీతామహాలక్ష్మి, వీఆర్వో సుష్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ముగిసిన కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు : పలకలూరురోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28, 29 రెండు రోజుల పాటు జరిగిన ఏఎన్‌యూ ఇంటర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు మంగళవారం ఘనంగా ముగిసాయని ప్రిన్సిపాల్ వి.అనురాధ పేర్కొన్నారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా నగరంలోని ఎస్‌వీఆర్ఎమ్ కళాశాల క్రీడాకారులు మొదటి స్థానంలో కప్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు. సింగరాయకొండలోని పీఎస్‌సీఎస్ గ్రూప్ ఆఫ్ కాలేజీ వారు ద్వితీయ స్థానంలో, బాపట్ల ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల వారు తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు విశ్రాంత అడిషినల్ ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గెలుపోటములు జీవితంలో దిక్సూచులుగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని కాలేజీల తరుపున టీమ్ కోసం విజ్ఞాన్ డిగ్రీ కళాశాల నుంచి వెంకటేష్‌ను ఎంపిక చేసినట్లు అనురాధ తెలిపారు.

జీజీహెచ్ ఆటో స్టాండ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-గుంటూరు : ది గుంటూరు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జీజీహెచ్ ఆటో స్టాండ్ జనరల్ బాడీ సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మంగా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్, నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం జీజీహెచ్ ఆటో స్టాండ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా కూరాకుల రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నందూరి రోశయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ లాల్ బుడే, సహాయ కార్యదర్శిగా షేక్ యూసబ్, కోశాధికారిగా వి.సాంబశివరావులతోపాటు కమిటీ సభ్యులుగా తడవర్తి సతీష్, టి.రాము, బి.శివకోటేశ్వరరావు, బి.శ్రీను, కె.నాగ రమేష్, వై.శివ, బి.సురేష్, షేక్ అక్బర్ వలి, ఎల్.వీరయ్య, ఎ.బలరాం రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బేస్ బాల్ పోటీలకు జడ్పీ విద్యార్థులు

విశాలాంధ్ర-శావల్యాపురం : శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కారుమంచి జడ్పీ పాఠశాల విద్యార్థులు బత్తుల యస్వత్ అండర్-17 జట్టుకు, మల్లాపరపు వినయ్ కుమార్ అండర్-14 జట్టుకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర రంగారావు మంగళవారం తెలిపారు. ఈ నెల 26న మేడికొండూరు మండలం మందపాడు జడ్పీ పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరు 19 నుంచి 22 వరకు శ్రీకాకుళంలో జరగబోయే బేస్ బాల్ పోటీలలో ఇద్దరు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకర రంగారావు, పీడీ పొదిలి వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్మన్ షేక్ అక్బర్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, సహచర విద్యార్థులు అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి

విశాలాంధ్ర - నకరికల్లు : మండలంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలను మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తుంగతుర్తి విశ్వనాధశాస్త్రీ, కృష్ణ మూర్తి శాస్త్రీలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి కావడి వేడుక గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, సుగంధ లేపనాలతో విశేష అభిషేకాలు, హోమాలు, స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి సహకరిస్తున్న గుంటూరు జిల్లా పరిషత్ వారికి ప్రత్యేక అభినందనలను తెలుపుతున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యార్థులకు చేయూత ఇవ్వాలని ముఖ్య ఉద్దేశంతో ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ వారు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ ప్రత్యేకంగా రూపొందించారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అధిక మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం జంగాల అనిత, ఉపాధ్యాయులు అచన కోటేశ్వరరావు, పారేళ్ళ తిరుమల గురు బాబు, బాలే శివ నాగేశ్వరరావు, ముప్పాల కృష్ణలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం నరసరావుపేట డీఎస్పీ కె.విజయభాస్కర్ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. విధినిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా ఈ స్టేషన్‌ను తనిఖీ చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది పనితీరును ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ సిఐ భక్తవత్సల్ రెడ్డి, ఎస్.ఐ సురేష్ బాబు, పోలీసులు పాల్గొన్నారు

క్యారమ్స్ జిల్లా జట్ల ఎంపిక

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాదినేని చౌదరయ్య స్కూల్లో క్యారమ్స్ సెలక్షన్స్ పోటీలు మంగళవారం నిర్వహించారు. అండర్-14,17,19 విభాగాల్లో బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు త్వరలోనే నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని సెలక్టర్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎం.లింగయ్యచౌదరి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌కే ఎండీ బాష తదితరులు పాల్గొన్నారు.

పెంచిన కూలి రేట్ల జీఓ విడుదల చేయాలి..

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : పౌరసరఫ రాల సంస్థ హమాలీలకు పెంచిన కూలి రేట్ల జీవో విడుదల చేయాలని ఈ నెల 29వ తేదీ నుంచి పనికి బంద్‌లో పిలుపులో భాగంగా పెదకూరపాడు నియో జకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో గొడౌన్ వద్ద మంగళవారం ఏఐటీయూసీ హమాలీల ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ఒంటి కాలుపై నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ముఠా కార్మికుల కూలి రేట్లు పెంపుదల ఒప్పందం పూర్తిచేసిన కార్పొరేషన్ అధికారులు ఇప్పటివరకు రేట్లు అమలు చేయకుండా కాల యాపన చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 2021 డిసెంబర్‌తో కూలీ రేట్లు ఒప్పందం పూర్తయిందని 2022 జనవరి 1వ తేదీ నుంచి రూ.22 రూ.25. వరకు పెంచిన కార్పొరేషన్ అధికారులు దాని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పట్టణ సీపీఐ కార్యదర్శి పరగటి రాజు మాట్లాడుతూ జీఓ విడుదల చేయకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా శ్రమించిన కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని అన్నారు. పెదకూరపాడు మండల ఏఐటీయూసీ హమాలీల సంఘం నాయకులు తేలా ప్రసాదు మాట్లాడుతూ జిల్లా ఏఐటీయూసీ పిలుపుమేరకు దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, సుధాకర్, రాజారావు, ఏడుకొండలు, సాంబశివరావు, పురుషోత్తం, ప్రభుదాస్, అనిల్, పొత్తూరి నాగేశ్వరరావు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట: పిన్నెల్లి

విశాలాంధ్ర-దుర్గి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల జీవనోపాధుల రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటి ఫలాలను అర్హులకు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. డ్వాక్రా మహిళలకు జీవనోపాధుల నిమిత్తం కుట్టుమిషన్లు, నాటుసారా అరికట్టు నిమిత్తం ప్రత్యామ్నాయ రుణాలు కింద 58 మహిళా లబ్ధిదారులకు రూ.58 లక్షలు, 310 స్త్రీనిధి కింద లబ్ధిదారులకు రూ.1.43 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యాలయ ఆవరణలో పూల మొక్క నాటి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ వి.గోపాల్, జడ్పీటీసీ ఎస్.యల్లమంద, ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్, రెంటచింతల ఎంపీపీ చౌడేశ్వరి, డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, డీఎల్‌డీఓ గబ్రూనాయక్, ఎంపీడీఓ జీఎల్ గుప్తా, ఏసీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్ నగర్, కంభంపాడులోని చౌక ధరల దుకాణాలను కలెక్టర్ లోతేటి శివశంకర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణంలో అందుబాటులో ఉన్న కార్డుదారులను విచారించారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా నిత్యావసర సరుకులు డోర్ డెలివరీ జరుగుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చౌక ధరల దుకాణాల వద్ద పీఎంజీకేవై ఉచిత బియ్యం పేదలకు రేషన్ షాపుల ద్వారా సరఫరా జరుగుతుందని అన్నారు. బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ-పాస్ మెషిన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు రేషన్ సరిగ్గా పంపిణీ చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్ బాబు, సహాయ పౌరసరఫాల శాఖాధికారి జమీర్ బాషా, డీటీ డి.కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

వాసవి క్లబ్స్ జిల్లా గవర్నర్‌గా విజయలక్ష్మి

విశాలాంధ్ర-వినుకొండ : వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి 204 ఎ నూతన గవర్నరుగా 2023 సంవత్సరానికి వినుకొండ పట్టణానికి చెందిన ఖజ్జాయం విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ పొట్టి హనుమంతురావు ప్రకటించారు. పిడుగురాళ్ల పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన 18వ జిల్లా వార్షిక సమావేశం (డిస్కాన్)లో ప్రస్తుత గవర్నర్ జూలకంటి శ్రీనివాసరావు నూతన గవర్నర్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు. అలాగే ఈ సంవత్సరం చేసిన సేవలకు గాను వాసవి క్లబ్ వినుకొండ వనిత క్లబ్, యూత్ క్లబ్‌లు పలు అవార్డులు పొందారు.

80 గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని 80 గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తయిందని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. భూ సర్వే అధికారులకు రైతులు సహకరించాలని ఆయన కోరారు. 70 గ్రామాల్లో భూ సర్వే రికార్డులు పూర్తి అయ్యాయని, 30 గ్రామాల రైతులకు భూసర్వే పత్రాలు త్వరలో అందజేస్తానని తెలిపారు. కొన్ని గ్రామాల్లో సుబాబుల్ తోటలు, ఇతర వాణిజ్య పంటలు సాగు చేస్తున్న నేపథ్యంలో భూ సర్వే కొంత ఆలస్యం అవుతుందని, రైతులు, పొలాల కొలతలను అధికారులకు అందజేయాలని అన్నారు. బ్యాంకు రుణాలకు ఇబ్బందులు లేకుండా రైతులకు భూ సర్వే పత్రాలను అందజేస్తామన్నారు.

పల్నాడు హాస్పిటల్స్ ఉచిత బస్ సౌకర్యం

విశాలాంధ్ర-గురజాల : చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలకు వైద్య సదుపాయం కల్పించేందుకు హలో నేస్తం కార్యక్రమంలో భాగంగా ఉచిత బస్ సౌకర్యానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని మాడుగుల గ్రామంలో గురజాల డీఎస్పీ జయరాం ప్రసాద్ పచ్చ జెండా ఊపి బస్ ప్రారంభించారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదలకు ఆరోగ్యం అందని ద్రాక్షలానే ఉండటం శాపం కాకూడదని సరైన వైద్యం సమయానికి అందని ఎందరో నిరుపేదలు నేలరాలిన సంధర్భాలు తమను చలింప చేయడంతో హలో నేస్తం కార్యక్రమం ద్వారా ఉచిత బస్ సర్వీస్‌ను నిర్వహించమని డాక్టర్ చింతలపూడి అశోక్ బాబు వివరించారు. గురజాల డీఎస్పీ జయరామ్ ప్రసాద్ మాట్లాడుతూ మీ ఆరోగ్యం మా భరోసా అంటూ ప్రతిఒక్కరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిరుపేదలకు భరోసా కల్పించటం పట్ల చింతలపూడి ట్రస్ట్ సంకల్పం గొప్పదని కొనియాడారు. ట్రస్ట్ మరెన్నో మంచి కార్యక్రమాలతో ముందుకు కొనసాగాలని డీఎస్పీ కోరారు. గురజాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి వారానికి రెండు రోజులు బస్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి బాబు, చావా రామారావు, యాగంటి రామారావు, గమిడి సురేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎడ్జ్ డిటెక్టర్ యంత్రాన్ని కనుగొన్న నూటన్స్ విద్యార్థులు

విశాలాంధ్ర-మాచర్ల: నూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమా విద్యార్థులు ఎడ్జ్ డిటెక్టర్ యంత్రాన్ని కనుగొన్నట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎడ్జ్ డిటెక్టివ్ యంత్రం ఐఆర్ సెన్సార్‌తో తయారు చేశారన్నారు. ఐ ఆర్ సెన్సార్‌ను వాహనాలకు అమర్చితే ప్రమాదాల నుండి కాపాడుకోవచ్చునన్నారు. ఏదైనా వాహనం రోడ్డు మార్గంలో ఎడ్జ్ దాటిన లేదా మూల మలుపుల వద్ద ఈ సెన్సార్ వాహనాలకు రక్షణగా ఉంటుందన్నారు. ఐఆర్ సెన్సార్లు తమ కళాశాల విద్యార్థులు కనుగొనటం సంతోషకరమన్నారు. ఇలా మరిన్ని పరికరాలను కనుగొనేందుకు విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాన్ని అందిస్తామన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జగదీశ్వర్ రెడ్డి, డీన్ సందీప్ రెడ్డి, హెచ్‌ఓడి సీతారామిరెడ్డి, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పురపాలక సంఘ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

అన్యాక్రాంతమౌతున్న క్రైస్తవ ఆస్తులను కాపాడాలి

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణంలో అన్యాక్రాంతమవుతున్న క్రైస్తవ ఆస్తులను కాపాడాలని కోరుతూ క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ అభివృద్ధి కమిటీ సమితి ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇమ్మానియేలు బాప్టిస్టు చర్చి సంఘ పెద్దలు నిరసన తెలియజేస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బేతం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో అమెరికన్ బాప్టిస్టు ఫారెన్ మిషన్ సొసైటీకి చెందిన విలువైన ఆస్తులు పట్టణ ప్రధాన కూడళ్లలో ఉన్నాయని, 70యేళ్ల క్రితం ప్రారంభమైన ఏబీఎం పాఠశాలకు చెందిన స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు అమ్ముకోవడం వలన పాఠశాల మూతపడిందని తెలిపారు. అలాగే కొందరు స్వార్థపరులు వారి ఆర్థిక అవసరాల కోసం పట్టణంలో ఉన్న క్రైస్తవ ఆస్తులన్నింటినీ తక్కువ ధరలకు వారికి ఎలాంటి హక్కు లేకపోయినా నకిలీ పత్రాలు సృష్టించి అమ్మారని అన్నారు. ఉమెన్స్ బంగళా, ఏబీఎం స్కూల్, హెల్త్ సెంటర్‌లకు సంబంధించిన స్థలాలను రియల్‌ఎస్టేట్ మాఫియా, భూకబ్జాదారులు తప్పుడు దస్తావేజులు సృష్టించి అమ్మారన్నారు. అలాగే అక్రమ కట్టడాలను సైతం నిర్మించి క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీశారని చెప్పారు. చర్చి ఆస్తులను తిరిగి ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు కారకులైన చిలకల జాన్ సుందర్రావు, గోరంట్ల వాసుదేవ మూర్తి, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. సంఘ అధ్యక్షులు బేతం శ్యాంప్రసాద్, కార్యదర్శి పందుల ఫిలిప్, గాబ్రెల్ మోజెస్, చాట్ల రామయ్య, గద్దల వరప్రసాద్, ప్రేమ్‌నాథ్, ప్రకాష్ పులిగుజ్జు ప్రసాద్, బేతం గాబ్రియల్, గుండాల స్వేనోము, సురభి జోసెఫ్ కుమార్, కాలేబ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దుర్గి : అడిగొప్పుల శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీఅమ్మ వారి సన్నిధికి ఆంధ్రప్రదేశ్ నాయి బ్రహ్మణ కేశఖండనశాల జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు మంగళవారం విచ్చేశారు. ఆలయ అర్చకులు విజయ్ కుమార్ వేదమంత్రాలతో ఆశీర్వదించి శ్రీ లక్ష్మీ అమ్మ వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తమ మొక్కుబడులను చెల్లించుకొని తీర్థప్రసాదా లను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం నాయి బ్రహ్మణ సోదరులు రామదాసును కేశనఖండశాలకు ఆహ్వానించారు. కేశఖండనశాల అధ్యక్షుడు మాచర్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ముటుకూరి నాగరాజు వారి సమస్యలను రామదాసు దృష్టికి తెచ్చారు. కార్యనిర్వాహణాధికారి శ్రీ గిరిరాజ్ నరసింహబాబుతో త్వరలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏజీఎల్ నారాయణ, జేఏసీ సభ్యులు దూపాటి శ్రీనివాసరావు, ముటుకూరి కోటేశ్వరరావు, మాచర్ల కొండలు తదితరులు పాల్గొన్నారు.

మేధావులు మౌనం వీడి ప్రశ్నించాలి

విశాలాంధ్ర-మాచర్ల: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మేధావులు మౌనం వీడి ప్రశ్నించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ డాక్టర్ వై.రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా నియోజకవర్గంలో పలు గ్రామాలలో అధికార పార్టీ ఆగడాలు అధికమయ్యాయన్నారు. జరుగుతున్న పరిణామాలపై మేధావులు, ప్రజలు ప్రశ్నించాలన్నారు. నష్టం జరిగింది మనకు కాదుగా అనుకుంటే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ఖూనీ కావడం ఖాయమన్నారు. అందరూ సమిష్టిగా పోరాడితేనే సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో డీసీసీ కార్యదర్శి జివి.సత్యనారాయణ, గాదె పుల్లారెడ్డి, వంగవీటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-నూజెండ్ల: మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం మండల కేంద్రం నూజెండ్లలో ఏకగ్రీవంగా జరిగింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులుగా నర్రా బాల్ రమేష్, ఉపాధ్యక్షులుగా షేక్ మీరావలి, కార్యదర్శిగా దేవరకొండ యోగయ్య, సంయుక్త కార్యదర్శిగా జొన్నకూటి అనంద్ కోశాధికారిగా నల్లదిమ్మ పద్మ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీని తహశీల్దారు మధుబాబు, డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది పలువురు అభినందనలు తెలియజేశారు.

జగనన్న విద్యాదీవెన విద్యార్థులకు వరం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : పేద విద్యార్థుల పాలిట జగనన్న విద్యాదీవెన పథకం వరమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకర రావు అన్నారు. ఈ నెల 30న విద్యార్థుల తల్లుల ఖతాల్లో విద్యాదీవెన ట్యూషన్ ఫీజు కోసం నిధులు జమ చేయనున్నట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గానికి సంబంధించి రూ.3.58 కోట్లు, 4,786 మంది తల్లుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. మొత్తం 5,324 మంది విద్యార్థులకు విద్యాదీవెన పథకం ద్వారా జమ అవుతాయని చెప్పారు. సీఎం జగన్ అందిస్తున్న విద్యాదీవెన పథకాన్ని ఉపయోగించుకొని అందరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా విజయకుమార్

విశాలాంధ్ర-చిలకలూరిపేట : సీనియర్ కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుడు, సామాజిక కార్యకర్త చిలకలూరిపేట వేలూరు గ్రామానికి చెందిన గద్దం పాల్ విజయకుమార్‌ను కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నియామక ఉత్తర్వులను పంపినట్లు పాల్ మంగళవారం తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేది కాంగ్రెస్ మాత్రమేన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు పోలవవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తారని, విభజన హామీలను నెరవేరుస్తారని, అమరావతిని రాష్ట్ర రాజధానిగా ఉంచుతారని పాల్ అన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ లబ్ధి

విశాలాంధ్ర - కర్లపాలెం : అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని నల్లమోతువారి పాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి గత మూడున్న రేళ్లలో ప్రతి ఇంటికి అందిన లబ్ధి వివరాల బ్రోచర్‌ను అందించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి సంక్షేమమే లక్ష్యంగా సీఎం పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి పక్ష పార్టీలు తమ మనుగడ కాపాడుకోనేందుకు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వం మరింతగా సంక్షేమం కోసం పాటుపడు తుందని తెలిపారు. ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ తాండ్ర సాంబశివ రావు, మండల కన్వీనర్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఉపాధ్యక్షులు కాగిత బుల్లియ్య, పందరబోయిన సుబ్బారావు, సర్పంచ్ మల్లెల ఆదాం, నాయకులు కుంట రత్నబాబు, మందపాటి పరమానందకుమార్, చిక్కాల సాగర్, మార్పు బెనర్జీ తదితరులున్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : మండలంలోని ఖాజీపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గద్దంవారిపాలెం విద్యుత్తు లైను గత కొన్ని సంవత్సరాల నుంచి పిట్టలవానిపాలెం సబ్ స్టేషన్ నుంచి సప్లై ఉండటం వలన అనేక సమస్యలు తలెత్తడంతో ఈ విషయాన్ని గ్రామ ప్రజలు పలు మార్లు సర్పంచ్ కుంతం అనూష ప్రసన్న రాజు, వైస్ ఎంపీపీ రామరాజు, ఎంపీటీసీ కాంత కుమారి యోహాను దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ విషయాన్ని వారు ఏపీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి తెలిపారు. స్పందించిన ఆయన వెంటనే పరిష్కరించాలని ఆదేశించడంతో మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఖాజీపాలెం సబ్ స్టేషన్‌కు అనుసంధానించారు. దీంతో పాటుగా కొత్తగా కొన్ని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య పరిష్కారం అవడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వి.శ్రీనివాసరావు, వార్డ్ నెంబర్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

విశాలాంధ్ర-తాడేపల్లి: మహానాడులో గల నాగేంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 30న జరిగే అన్నదాన కార్యక్రమానికి తాడేపల్లి పట్టణ బీసీ సెల్ కార్యవర్గ కార్యదర్శి గంధం సురేష్ 50 కేజీల బియ్యం, 500 వందల ఇస్తారకులు వితరణగా మంగళవారం అందజేశారు. తాడేపల్లి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు సిహెచ్.శివుడు, గుంటూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి సిహెచ్ హరినాథ్ పాల్గొన్నారు.

కొత్త కూలి రేట్ల జీవో విడుదల చేయాలి: శ్యామ్యూల్

విశాలాంధ్ర - బాపట్ల : పౌర సరఫరా ముఠా కార్మికు లకు పెంచిన కొత్త కూలీ రేట్ల జీవో వెంటనే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర పిలుపు మేరకు బాపట్లలో పౌరసరఫరాల శాఖ గిడ్డంగి వద్ద ముఠా వర్కర్స్ బాపట్ల ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ పౌర సరఫరా ముఠా కార్మికులకు క్వింటాకు రూ.22 నుంచి రూ.25కు పౌర సరఫరాల శాఖ అంగీకరించారన్నారు. పెంచిన రేట్లు ప్రకారం జీవో విడుదల చేసి జనవరి 2022 నుండి అరియర్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సొంత గోడౌన్ లేని ప్రదేశాలలో స్థలాలు తీసుకొని ప్రభుత్వమే గోడౌన్‌లు నిర్మించాలని కోరుతున్నామన్నారు. గత కార్మికుడు వద్ద పీఎఫ్ రికవరీ చేస్తున్నప్పటికీ ఆ కార్మికుడు ఖాతాలో పీఎఫ్ ఎంత ఉన్నదో తెలుసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి ఏడాది పీఎఫ్ స్లిప్పులు కార్మికుడికి ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలో ముఠా కార్మికులకు దసరా బోనస్, స్వీట్ కానుకలు ఇవ్వలేదన్నారు. ఏడాది పైబడి పని చేస్తున్న ముఠా కార్మికులందరికీ దసరా బోనస్ స్వీట్లు ఇవ్వాలని గతంలో ఉన్న సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఈ నిరసనలో బాపట్ల సివిల్ సప్లై ముఠా నాయకులు శ్రీనివాసరావు, జిల్లా సీపీఐ నాయకులు జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ నాయకులు జేబీ శ్రీధర్, షేక్ కరముల్లా తదితరులున్నారు.

ఏపీఎన్జీవో జిల్లా సభ్యులను కలిసిన మాచర్ల యూనిట్ సభ్యులు

విశాలాంధ్ర-దుర్గి: ఏపీఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్ బృందం సోమవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. ఈ సందర్భంగా మంగళవారం మాచర్ల తాలూకా ఎన్జీవో సభ్యుల అధ్యక్షుడు శ్రీగిరి రాజు నరసింహా బాబు, జనరల్ సెక్రటేరి రఘురామీరెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు మిగిలిన సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉద్యోగుల కోసం డీఏ బకాయిల, సీపీఎస్, తదితర అంశంల గురించి రాష్ట్ర జిల్లా కార్యవర్గం ఇచ్చే సూచనలు తప్పక పాటిస్తాం అని హామీ ఇచ్చారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : వంటగ్యాస్ లీక్ అయి వృద్ధురాలు అగ్నిప్రమాదానికి గురైన సంఘటన మంగళవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాటిమీద ప్రాంతంలో పొట్టి సుబ్బాయమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. ఉదయం 10.30 సమయంలో అగరవత్తులు వెలిగించేందుకు అగ్గిపుల్ల ముట్టించింది. అదే సమయంలో వంట గ్యాస్ లీక్ అయి ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆమె కేకలు గమనించిన స్థానికులు ఆమెను బయటకు తెచ్చి 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి.. చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ శోభన్ బాబు, పైలట్ రాము ఆమెకు ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలు అధికంగా ఉండటంతో వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేయగా అదే వాహనంలో ఆమెను గుంటూరుకు తరలించారు.

నల్లమేకల వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి విగ్రహం సెంటర్లో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లమేకల వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు మండల పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రేపూడి తామస్, కాపు నాయకులు పార్థసారథి, రాయుడి సుబ్బారావు, యూనిట్ ఇంచార్జి పసుపులేటి పాపిరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు శివరాత్రి పెద్ద శ్రీను, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు ఏసుపోగు నాగయ్య, కొమ్మువారపు దిబ్బయ్య, పటన్ గాలిషా, షేక్ వలి, జిల్లా టీఎన్ఎస్ఎఫ్ కోట చంటి, తాళ్లూరి రాంబాబు, గొర్రెపాటి కళ్యాణ్, చిగురుపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ఏసుపోగు రాంబాబు, షేక్ మస్తాన్, షరీఫ్, గద్దం బుచ్చిబాబు, ఎనుముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతానికి ప్రతి రైతు కృషి చేయాలని జీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ శేష బానురావు అన్నారు. బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, లక్నో వారి ఆధ్వర్యంలో విజయవాడలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ కోపరేటివ్ బ్యాంక్, స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ బ్యాంక్ సిబ్బందికి జరుగుతున్న శిక్షణా తరగతులలో భాగంగా సొసైటీల పనితీరు, పురోగతిని క్షేత్రస్థాయి పరిశీలించేందుకు శావల్యాపురం, వేల్పూరు, ఈపూరు, అంగలూరు సొసైటీ కార్యాలయాలను వారు మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేశారు. జీఎం మాట్లాడుతూ నాబార్డు సహకారంతో జీడీసీసీ ఆధ్వర్యంలో సొసైటీల ద్వారా అమలౌతున్న కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్ల నిర్మాణాలు, పెట్రోల్ బంక్లు, రైతులకు అందిస్తున్న పంటరుణాలు, ఎరువులు, వ్యాపార లావాదేవీలు తదితర అంశాలపై శిక్షణనిచ్చి సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేల్పూరులో కోల్డ్ స్టోరేజీ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. నాబార్డు డీజీఎంలు ప్రశాంత్ దూబే, అనుకంపర్ఘూ, ఏజీఎంలు కార్తీక్, చౌసాల్కర్, ఆప్కాబ్ ఏజీఎం నాగేశ్వరరావు, జీడీసీసీ డీజీఎం ఫణికుమార్, సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసాద్, యేరువ వెంకట నారాయణ, సొసైటీ డైరెక్టర్ వంగోలు ఆంజనేయులు, సూరాబత్తుని కృష్ణారావు పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే వెన్నుముక

విశాలాంధ్ర-గుంటూరు : ఇటీవల గుంటూరు జిల్లా బీసీ గౌడ సాధికార సమితి కన్వీనర్‌గా నియమితులైన బత్తిని శంకర్ గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్‌ను స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముకలాంటి వారని అన్నారు. టీడీపీ ఆవిర్భావానికి ముందు బీసీలకు గుర్తింపు లేదని, బీసీలను ఆదరించింది, బీసీల సాధికారత కోసం కృషి చేసింది తెలుగుదేశం పార్టీనేనని అన్నారు. అనేకమంది బీసీలను ఎమ్మెల్యేలుగా గెలిపించిన ఘనత టీడీపీదేనని అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కూడా టీడీపీదేనన్నారు. బీసీలందరు సమిష్టిగా కృషి చేసి రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజామాస్టారు, వేములకొండ శ్రీనివాస్, హుస్సేన్, బొబ్బిలి రామారావు, గొడుగు శంకర్, వంగర ఏడుకొండలు, బత్రాజు హనుమంతరాజు, గుడిపల్లి నవీన్, షేక్ చిన్నబాజి, అర్వపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోటిపడగల పుణ్యక్షేత్రం పున:ప్రతిష్ట

విశాలాంధ్ర-భట్టిప్రోలు : కోనేటిపురంలో కొలువైయున్న కోటిపడగల పుణ్యక్షేత్రం పున: ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. కోనేటిపురం పుట్టగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర సుబ్రహ్మణేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా సుబ్రహ్మణ్య షష్ఠి మంగళవారం దేవాలయాన్ని రేపల్లెకు చెందిన ప్రముఖ వైద్యులు ఆకురాతి వెంకట సుబ్బారావు ప్రారంభించారు. ఉదయం నుంచి స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ప్రతిష్ఠా కార్యక్రమాలను రావూరి నరేష్ శర్మ బృందం, వంగర చలమయ్య సిద్ధాంతి పర్య వేక్షణలో జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటి అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరులో మంగళవారం హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ఆధ్యాత్మిక గ్రంథాలతో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. హిందూత్వమును బోధించుదేశంగా హిందూ దేశమని ఇతర దేశాలు పిలిచేవారని హిందూ అనే పదం మతానికి సంబందించినది కాదని జ్ఞానానికి సంబంధించినదిగా ప్రజలు గుర్తుంచుకోవాలని భారతదేశానికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతోనే గ్రామాల్లో అనుబంధ గ్రంథాలతో ప్రచారం చేస్తున్నట్లు శ్రీనవాసరావు తెలిపారు. సేవా సమితి సభ్యులు రామకృష్ణ, శివలింగ హరిబాబు, సుబ్బారావు, శివ, శ్రీదేవి అరుణ, లక్ష్మి, దిల్‌షా, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలు పేదల పాలిట వరాలు

విశాలాంధ్ర-బెల్లంకొండ : తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విధానాలు, చేసిన సంస్కరణలు పేదల పాలిట వరాలుగా మారాయని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే గత మూడేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు, కుటుంబాల వారీగా పొందిన లబ్ధిని వివరించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ఎంతమందికి సంక్షేమ లబ్ది చేకూరుతుందో తెలుపుతూ కరపత్రాలను అందజేశారు. రూ.5.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు.

ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా దీవెన్

విశాలాంధ్ర-గుంటూరు: ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజరుగా జి.దీవెన్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ జనరల్ మేనేజరుగా పని చేసి బదిలీపై గుంటూరు జోనల్ ఆఫీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే ఆఫీసులో మేనేజరుగా పనిచేసిన తనకు జోనులో ఉన్న అన్ని ఆటోనగర్లు, పారిశ్రామిక వాడలపై అవగాహన ఉన్నందున వాటి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు డిప్యూటీ జోనల్ మేనేజరుగా పనిచేసిన బి.రామారావు బదిలీపై రాజానగరం ఎంపీడీవోగా మాతృ సంస్థకు వెళ్లారు.

పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మహనీయులు జ్యోతి రావు పూలే ఆశయాలను నేటి యువత స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు అన్నారు. సోమవారం స్థానిక చుట్టుగుంట లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో తొలి సామాజిక ఉద్యమకారులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 132వ వర్ధంతి కొల్లూరి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగింది. పూలే చిత్ర పటానికి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా హనుమంత రావు మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను మరువకూడదని, వారి త్యాగాల ఫలమే ఈ రోజున సమాజంలో మనకి విలువలని వెనకబడ్డ వర్గాలకి ఎంతో ఆదర్శ ప్రాయుడైన పూలేని స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ట్రెజరరి కన్నా మాస్టర్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బీసీ రాష్ట్ర నాయకులు దాసరి శివకుమార్, మల్లే ఈశ్వర రావు, పావులూరి హనుమంతరావు, కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం, ముప్పాన వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి పేరయ్య, పిన్నేబోయిన శ్రీనివాస్, నక్కల నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లోకేష్‌కు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కి వై కేటగిరీ నుండి జెడ్ కేటగిరీ భద్రత కలిగేలా రాష్ట్ర డీజీపీ కేంద్ర హోమ్ శాఖకు సిఫార్సు చేయాలని, తోపుదుర్తి చంద్రశేఖర రెడ్డి వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి పీడీ ఆక్ట్‌తో రాష్ట్ర బహిష్కరణ చేయాలని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీకి వ్రాసిన ఫిర్యాదును గ్రీవెన్సులో అడిషనల్ ఎస్పీ సుప్రజకి రాష్ట్ర తెలుగుయువత యువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంచుమర్తి శేషు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అతని సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లపై చేసిన వ్యాఖ్యలను సుమోటోగా పరిగణించి చర్యలు తీసుకోవాలన్నారు. తోపుదుర్తి చంద్రశేఖర రెడ్డి చంద్రబాబు నాయుడు, లోకేష్‌లనుద్దేశించి బహిరంగంగా చేసిన తీవ్ర అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులుపై జరుగుతున్న హత్యారాజకీయాలు, హత్యా ప్రయత్నాలు, దాడులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యల వెనక పెద్ద కుట్రే ఉన్నట్లు అనుమానించి వలసి వస్తుందన్నారు. ఆయన పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి తగు చర్యలు తీసుకొని ఆయన వ్యాఖ్యల వెనుకయున్న కుట్రను బహిర్గతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శ్రీనివాసరావు, కార్యదర్శులు ఈదర త్రినాద్ తదితరులు పాల్గున్నారు.

స్పందనకు 38 ఫిర్యాదులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రం పరిష్కరించాలని విభాగాదిపతులకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.రోజా తెలిపారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 38 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 16, ఇంజినీరింగ్ విభాగం 12, ప్రజారోగ్య విభాగం 5, రెవెన్యూ విభాగం 3, ఉపా సెల్ 2 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ మూర్తి, సిఎంఓహెచ్ డాక్టర్ విజయ లక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పనులు సక్రమంగా చేపట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమంలో సర్వే పనులు సక్రమంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారితో కలసి క్షేత్ర స్థాయి సర్వే సిబ్బందికి, పరిశీలకుల స్థాయి నుండి గ్రామ సర్వేయర్లకు సర్వే కిట్లు, మెడికల్ కిట్ లు, జియో పోస్టు పెయిడ్ సిమ్ కార్డు, స్టెయిన్ లెస్ స్టీల్ వన్ లీటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. సుమారుగా 300 మందికి ఈ కిట్స్ ను అందించడం జరుగుతుంది. సర్వే పనులు సక్రమంగా, వేగంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లలిత, డిఆర్ఓ చంద్ర శేఖర రావు, సర్వే శాఖ సహాయ సంచాలకులు రూప్లా నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 154 ఫిర్యాదులు

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: పల్నాడు జిల్లా ప్రజల సమస్యల పరిష్కరించడం కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం 'స్పందన' కు పెద్ద సంఖ్య లో ప్రజలు తరలి వచ్చి వినతి పత్రాలను అందించారు. కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంభందిత అధికారులకు వాటిని అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 154 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల కు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఉచిత అన్నదానం కార్య క్రమానికి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డి.ఆర్.ఓలు ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్క రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ విద్యకు ప్రాధాన్యత కల్పించిన పూలే

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అణిచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి, స్త్రీ విద్యకు ప్రాధాన్యత కల్పించిన మహానుభావుడు జ్యోతిబాపూలె అని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జ్యోతిబాపూలే 132వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక నగరపాలక సంస్థ విశాంత్రి గృహం వద్ద ఉన్న పూలే విగ్రహానికి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్య వర ప్రసాద్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తంతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూధన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గాభవాని, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ సాంబశివరావు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండల కేంద్రమైన భట్టిప్రోలు శివారు కోడిపర్రు ప్రధాన రహదారి మార్గంలో మలుపు వద్ద ఇసుక టిప్పర్ బోల్తా పడిన సంఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. భట్టిప్రోలు నుంచి తెనాలి వైపు వెళు తున్న ఇసుక టిప్పర్ భారీ మలుపు వద్ద అదుపు తప్పి ప్రక్కనే ఉన్న పంట పొలంలోకి బోల్తా కొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పుకుని పరారైనట్లు తెలుస్తోంది. టిప్పర్‌లోని ఇసుక మొత్తం కోతకు వచ్చిన వరి పంట పొలంలో పడడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నిత్యం రైతులు, ప్రజలు, ప్రయాణీకుల రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం జరిగిన సమయం తెల్లవారు జామున కావడంతో ఏవిధమైన ప్రాణ నష్టం జరగలేదు.

తెలుగు రామ్ మనోహర్ లోహియ సీఎం వైఎస్ జగన్

డొక్కా మాణిక్యవర ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బీసీల అభ్యున్నతికి దేశ స్థాయిలో రామ్ మనోహర్ లోహియా కృషి చేస్తే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే 132వ వర్ధంతి సందర్భంగా గుంటూరు జిల్లా వైసీపీ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్లో పూలే వర్ధంతి సభ సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహాత్మా జ్యోతిరావు పూలేను తన గురువుగా ప్రకటించుకున్నారని తెలిపారు. కుల వ్యవస్థ బలంగా వేలూరుకున్న మన సమాజంలో విద్యాభివృద్ధికి మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు చేసిన కృషి అనిర్వచనీయమని కొనియాడారు. బీసీల అభ్యున్నతికి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ ఉద్యమ స్థాయిలో కృషి చేస్తున్నారని, ప్రభుత్వంలోని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేసి వారికి రాజకీయ, సామాజిక హోదా కల్పించారని అన్నారు. ఒక బీసీలకే కాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాష్ట్ర క్యాబినెట్లో అత్యధిక పదవులు, స్థానిక సంస్థల్లో సైతం పదవులు కట్టబెట్టారని తెలిపారు. ఈ అవకాశాన్ని బడుగు, బలహీన వర్గాల నాయకులు వినియోగించుకుని రాజకీయంగా మరింత ముందుకు ఎదగాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌ను ప్రతి ఒక్కరూ బలపరచాలని కోరారు. బడుగు, బలహీన వర్గాలు ఎదగడం ఓరవలేక ప్రతిపక్షాలు వారిపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమ ర్శించారు. గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ ఏసురత్నం మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తూ బురద జల్లటం ఇకనైనా మానుకోవాలని హితవుపలికారు. ఈ సభకు రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ అధ్యక్షులు మండేపూడి పురుషోత్తం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కన్న మాస్టారు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ అనురాధ, విభిన్న ప్రతిభావతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ బేగం, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, మహిళా నాయకులు నూర్ ఫాతిమా, కార్పొరేటర్ రాజలత, పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలి: అబ్దుల్ గని

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నర్సాపురంలో జరిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభకు హాజరయ్యే క్రమంలో ముస్లిం మహిళలు తమ మతాచారమైన బురఖాను ధరించి సభకు వస్తుంటే భద్రత పేరుతో పోలీస్ అధికారులు, సిబ్బంది బురఖాను తొలగించమని చెప్పి సభకు పంపడం చాలా విచారకరమని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు కాలరాయడమేనని దీనిపై విచారంచి తగు చర్యలు తీసుకోవాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ గని, మైనార్టీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ గని మీడియాతో మాట్లాడుతూ సీఎం భద్రత పేరుతో బురఖాలు తొలగించి సభకు అనుమతించడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మౌనంగా ఉండటం నష్టదాయకమని అన్నారు. ఈ చర్యల వల్ల ముస్లింల మనోభావాలు దెబ్బతీయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, జరిగిన సంఘటనపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి రిజ్వాన, రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ బాజీ కరిముల్లా, మహమ్మద్ మోసిన్, అబ్దుల్ రఫి, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ వర్గ సభ్యులు మీరా సాహెబ్ చిన్నా, బాజీ వస్తుంబాబు, షేక్ సాజిత్, జమీద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సీహెచ్ఓ, ఎంపీహెచ్ఈఓ, హెచ్ఈలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుమయ ఖాన్ 'జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు'పై సమీక్షా సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ సుమయా ఖాన్ మాట్లాడుతూ అనుభవం ఉన్న సూపర్‌వైజర్లు వైద్యాధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ సుబ్బా రావు మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణీలకు ఇచ్చే టీకాలు సకాలంలో ఇచ్చిన వెంటనే హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఎంఆర్ వ్యాధి నిరోధక టీకాను ఈ నెలలోనే ఇవ్వాల్సి ఉందని, వ్యాధి నిరోధక టీకా రిజిస్టర్ సరి చేసుకొనుట, నమోదు సరిచేయుట చేయాలని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని 2023, జనవరిలో ఉండవచ్చని, దానికి అందరూ సూక్ష్మ ప్రణాళికా సిద్ధంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రత్న మన్‌మోహన్ మాట్లాడుతూ బయోమెట్రిక్ 100శాతం ఉండాలని, లేనిపక్షంలో ఉద్యోగుల జీతాలకు కోత విధించబడునని హెచ్చరించారు. రెండు రోజుల్లో బయోమెట్రిక్ సాంకేతిక సమస్యలు పరిష్కరించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవములు నిర్వహించాలని, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని చెప్పారు. డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి అవసరమైన 64రకాల మందులు, 14 రకములైన డయాగ్నోస్టిక్ పరీక్షలకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలో రక్తహీనత పరీక్షలు నిర్వహించి లోపం ఉన్న పిల్లలకు చికిత్స తప్పనిసరిగా అందించాలని కోరారు. శిశు మరణాలు, మాతృ మరణాలు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు.

ఎస్సీల సంక్షేమ, అభివృద్ధి పథకాలు పునురుద్ధరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: దళితులకు ఉన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు కేటాయించి వాటిని పునరుద్దరించాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్(డీహెచ్‌పీఎస్) కాబోతు ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, బీకేఎమ్‌యూ నాయకులు గుర్రంకొండ సత్యానందం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, సారధితో కలిసి జాయింట్ కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉపాధి పథకాలకు నిధులు కేటాయించకపోవడం వలన రోజు రోజుకు దళిత వర్గాల ప్రజల జీవనం దిగజారి పోతుందన్నారు. గత మూడు సంవత్సరాల నుండి 20 రకాల పథకాలు అమలు కానందున రాష్ట్రంలో 17 శాతంగా ఉన్న దళిత యువకులు, మహిళలు, నిరుద్యోగులు ఉపాధికి దూరమవుతూ అభివృద్ధిలో ఆమడదూరంలో ఉన్నారన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ఎన్ఎస్ఎఫ్‌డీసీ లాంటి పథకాలు కొద్దిమంది దళిత యువకులకు ఉపాధి అవకాశాలు వస్తూ ఉండేవి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే సబ్సిడీ రుణాలు, భూమి కొనుగోలు పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్, కులాంతర వివాహాల ప్రోత్సాహ నిబంధనలు సడలింపు తదితర పథకాలకు నిధులు కేటాయించకపోవడం వలన రోజురోజుకు దళిత వర్గాల ప్రజల జీవనం దిగజారిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గతంలో దళితులకు ఉన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు కేటాయించి పునరుద్ధరించాలని కోరారు.

వైసీపీ అంటేనే ఫ్యాక్షన్ పార్టీ : కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలను ఆదర్శంగా తీసుకుని వైసీపీ నాయకులు అరాచంగా వ్యవహరిస్తున్నారని, అధికారమదంతో కన్నుమిన్నూ కాకుండా విర్రవీగుతున్నారు. ఇష్టానుసారంగా బరితెగించి ప్రవర్తిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులను దూషించి, దాడులు చేయించి ప్రజాకర్షణ పొందాలనే దుర్బుద్ధి వారి రాజకీయ జీవితాలకు శాపంలా మారుతుందని గ్రహించలేకపోతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును నోటికొచ్చినట్లు దూషించిన వైసీపీ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి సంబోధించడం వైసీపీ ఫ్యాక్షన్ పార్టీ అనడానికే నిదర్శనం. అసలు వైసీపీ పార్టీ రక్తపు మడుగుల్లో నుంచి అధికారంలోకి వచ్చింది. నాడు జగన్ రెడ్డి తండ్రి వైఎస్ సమాధి ముందు నుంచే సీఎం సీటు కోసం ప్రయత్నించారు. పార్టీ పెట్టిన తరువాత అధికారంలోకి వచ్చేందుకు కోడి కత్తి నాటకమాడారు. బాబాయ్‌ని గొడ్డలి పోటుకు గురి చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. నేడు ప్రతిపక్ష పార్టీల నాయకులను, ప్రజలను బెదిరించి ఫ్యాక్షన్ రాజకీయాలను కొనసాగిస్తున్నారు. చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలను వైసీపీ అధిష్టానం ఇప్పటి వరకూ ఖండించకపోవడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. మాట్లాడిన తోపుదుర్తిని వదిలేసి అతడి వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేయడం దుర్మార్గం అన్నారు. స్టేషన్ ఎదుటే వైసీపీ శ్రేణులు టీడీపీ నాయకులపై అరాచకంగా దాడి చేస్తే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారంటే మీరు రాష్ట్ర ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు.

వినతులను హేతుబద్ధంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులను పరిశీలించి సత్వరమే హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా రెవిన్యూ అధికారి చంద్ర శేఖర రావు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన 156 మంది అర్జీదారులు స్పందనలో పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులను అందజేశారు. డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, డిపిఓ కేశవరెడ్డి, సంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, డిఎఫ్ఓ మహబూబ్ బాషా, డియంఅండ్‌హెచ్ఓ డా.సుమయాఖాన్, డిఇఓ శైలజ పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి

విశాలాంధ్ర-మంగళగిరి: అట్టడుగు, అణగారిన ప్రజలకు విద్యను అందించిన జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళగిరి నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో సోమవారం వైసీపీ సీనియర్ నాయకులు కట్టెపోగు ఉదయ భాస్కర్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఆనాటి సమాజంలో అణగారిన వర్గాల కోసం ఆధిపత్య కులాలను ఎదిరించి పేదవారికి విద్యను అందించిన గొప్ప దార్శకుడు జ్యోతిరావు పూలే అని, ఆయన్ని స్మరించుకోవటం మన బాధ్యత అన్నారు. పూలేకు నివాళులర్పించిన వారిలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల జడ్పీటీసీ సభ్యులు మేకతోటి అరుణ, మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి వీరయ్య, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, టి.జానుబాబు, మిట్టల నిర్మల నియోజవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర-తెనాలి : ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా నిర్వహించే స్పందన కార్యక్రమానికి పలు సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో డివిజన్లోని వివిధ పోలీసు ఠాణాలకు సంబంధించి వచ్చిన కేసులు అధికమని తెలిపారు. రెవెన్యూ సంబంధించి 22 ఎ తొలగింపు, ఆక్రమణ, పౌర సరఫరా, అనధికార క్రీస్‌పాయింట్ తొలగింపు, స్కూలు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చికిత్స, సంబంధించి 11ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించి నివేదికలను పంప వలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

షేక్ షాహిన్‌కు గోల్డ్‌మెడల్

విశాలాంధ్ర-మంగళగిరి : కొత్తపేట సచివాలయంలో వెల్ఫేర్ సెక్రెటరీగా పనిచేసే షేక్ షాహిన్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యా పురస్కారం(గోల్డ్ మెడల్) లభించింది. మూడు జిల్లాల పరిధిలో పీజీ కోర్సులో 93 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను గోల్డ్ మెడల్‌కు ఎంపిక చేశారు. రిటైర్డ్ ఆడిషనల్ డీజీపీ కూచిపూడి బాబూరావు, కమిషనర్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ దయాసాగర్‌ల చేతుల మీదుగా గుంటూరు ఏసీ కళాశాలలో సోమవారం గోల్డ్ మేడల్‌తో పాటు రూ.20 వేలు నగదు, ట్యాబ్, జిల్లా కలెక్టర్ పంపిన ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆమెకు కార్పొరేషన్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 27,741 మందికి వడ్డీ రాయితీ : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైఎస్సార్ సున్నా వడ్డీ పంట ఋణాల పథకం రబీ 2022, ఖరీఫ్ 2021 క్రింద గుంటూరు జిల్లాలో 27,741 మంది రైతులకు రూ.6 కోట్ల 49 లక్షలు వడ్డీ రాయితీ చెక్కును రైతులకు కలెక్టర్ అందజేసారు. రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీరాయితీ సొమ్ముతో పాటు గతంలో వివిధ సాంకేతిక కారణాల వల్ల చెల్లింపులు పొందని వారి అకౌంట్లలో జమ చేసే సొమ్ముతో కలిపి మొత్తం రూ.200 కోట్లను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్.శివరామకృష్ణ, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డీడీ ఉద్యాన శాఖ సుజాత, డీడీ ఆత్మా రామాంజనేయులు, డీడీ ఏ.పి.ఎం.ఐ.పి వజ్రశ్రీ, వ్యవసాయ అధికారిణి అరుణ శ్రీ, రైతులు పాల్గొన్నారు. జిల్లాలో 2022 సెప్టెంబర్, అక్టోబర్ మాసములలో కురిసిన భారీ వర్షాల వలన పంట నష్ట పోయిన 460 మంది రైతులకు, నవంబర్ 2021లో భారీ వర్షాల వలన పంట నష్టపోయి పెట్టుబడి సాయం జమకాని 2032 మంది రైతులకు అందించే పెట్టుబడి సాయం రూ.2,37,65,805ల చెక్కును రైతులకు చెక్కను అందించడం జరిగింది.

గ్రామాల్లో క్రిస్మస్ స్టార్స్

విశాలాంధ్ర-తాడికొండ : గ్రామాల్లో క్రిస్మస్ స్టార్లు వెలి శాయి. డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నెలరోజులు ముందుగా క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేయటం పరిపాటిగా మారింది. ప్రధాన సెంటర్లు రహదారులలో స్టార్లను ఏర్పాటు చేస్తున్నారు. 2022కు వీడ్కోలు పలుకుతూ 2023కు స్వాగతం పలుకుతూ స్టార్లు వెలిశాయి. క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ స్టార్లు ఏర్పాటు చేశారు. రకరకాల డిజైన్లు ఆకారాలతో పలు రకాల చిత్రాలతో స్టార్లను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా స్టార్లు వెలిశాయి.

నేడు డ్వాక్రా మహిళలకు జీవనోపాదుల పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి : వైఎస్సార్ క్రాంతి పథకంలో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మంగళ వారం ఏర్పాటు చేసిన పరివర్తన కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు జీవనోపాదుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్ తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులతో ఎంపీపీ తన కార్యాలయంలో సోమవారం చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జీవనోపాదుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు, యార్డు చైర్మన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ జీఎల్ గుప్తా, ఏపీఎం లక్ష్మీనారాయణ, కార్యాలయ పరిపాలనాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థికి నాలుగు స్వర్ణాలు

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐటీ మొదటి సంవత్సరం చదువుతున్న ముఖేష్ అనే విధ్యార్ధి రైఫిల్ షూటింగ్‌లో జాతీయ స్థాయి రికార్డులను నెలకొల్పి నాలుగు బంగారు పతకాలను సాదించినట్లు క్రీడల అసోసేయేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ సోమవారం తెలిపారు. 65వ జాతీయ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 12 వరకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరుగుతున్న రైఫిల్ షూటింగ్‌లో జాతీయ రైఫిల్ చాంపియన్ షిఫ్ స్టాండర్డ్ ఫిస్టల్ విభాగంలో ఎన్.ముఖేష్ 25 మీటర్ల లక్ష్యాన్ని చేదించి బంగారు పతకాలను సొంతం చేసుకున్నట్లు వారు తెలిపారు. స్టాండర్డ్ ఫిస్టల్ సివిలియన్‌లో జూనియర్ విభాగంలో ఒకటి, సీనియర్ విభాగంలో మరొకటి రెండు బంగారు పతకాలను సాదించగా ఇదే నెలలో 23వ తేదిన కూడా స్పోర్ట్స్ ఫిస్టల్ సివిలియన్ విభాగంలో కూడా మరో రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. దీంతో ముఖేష్ ఖాతాలో మొత్తం నాలుగు బంగారు పతకాలు వచ్చిచేరాయని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ పోటీలు వచ్చే నెల 12 వరకు జరుగుతాయని, వాటిలో కూడా ఇంకా ముఖేష్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో.వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ.జగదీష్, డీన్, విద్యార్థి విభాగం సంక్షేమ అధిపతి హనుమంతరావు తదితరులు ముఖేష్‌కు అభినందనలు తెలిపారు.

భారత సాయుధ దళాల పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-నరసరావు పేట కలెక్టరేట్ : దేశభక్తిని పెంపొందించుకొని భారత సైనిక దళాలు చేస్తున్న సాహసం, త్యాగాల ఫలితంగా ప్రజలంతా సంతోషముతో జీవిస్తున్నారని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమవారం భారత సాయుధ దళాల పతాక దినోత్సవం వచ్చే డిసెంబరు నెల 7న నిర్వహించుకునేందుకు ప్రతీఒక్కరూ సన్నద్ధం కావాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపునిచ్చారు. ఈ మేరకు సైనిక బోర్డు చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ స్టిక్కర్స్, కార్ ఫ్లాగ్స్‌ను జిల్లా అధికారుల సమక్షంలో విడుదల చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన వీర జవానుల కుటుంబాల అండగా ఉందామని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం స్టికర్స్, కార్ ఫ్లాగ్స్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి జాయింట్ కలెక్టర్, డీఆర్వోలు విడుదల చేశారు. అమరవీరుల కుటుంబాల సహాయార్థం వీటిని ప్రతీఒక్కరూ స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిణి గుణ షీలా తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలిని ఆదుకోవాలి

విశాలాంధ్ర-రెంటచిం తల : ఇటీవల గుంటూరులో హత్యాచారానికి గురైన భాదిత మహిళను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మహాజన సోషలిస్టు పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.శ్రీనివాసరావు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, ఐదు ఎకరాల భూమిని మంజూరు చేయాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో వెంకయ్య, మునసలయ్య, దానమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.